క్లుప్తంగా

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి

హనుమంతునిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై ఏఎన్‌ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు, కార్యదర్శులకు, విలేజీ పోలీసులకు సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేయాలన్నారు. వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి జాబితా తయారు చేయాలన్నారు. ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో అక్టోబర్ 3వ తేదీ నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారన్నారు. ఏఓ జీవీ క్రిష్ణారావు, డాక్టర్ మూరక ప్రతాపురెడ్డి, సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, ఈఓఆర్డీ షేక్ షరీఫ్, సూపర్‌వైజర్లు, సిబ్బంది మధుసుదన్ రెడ్డి, రఘురాము పాల్గొన్నారు

ప్రమాదంలో ఒకరికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని పులిపాడు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటిరెడ్డికి గాయాలయ్యాయి. పసుపుగల్లు గ్రామానికి చెందిన కోటిరెడ్డి ద్విచక్రవాహనంపై దర్శి వెళ్తుండగా దర్శి – అద్దంకి ప్రధాన రహదారిలో రెడ్డినగర్– పులిపాడు మధ్యలో ఎదురుగా వస్తున్న అద్దంకి డిపోకి చెందిన ఆర్టీసీ ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో కోటిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ మూలమంత్ర హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పామూరు: వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో మృత్యుంజయ మూలమంత్ర హోమం బుధవారం రుత్వికులు రాయప్రోలు తులసీనాథ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మొదట వాసవీమాత మూల విగ్రహమూర్తికి అర్చకులు తులసీనాథ్, రాఘవ సుమంత్‌లు అభిషేకం వేదమంత్రాలతో నిర్వహించారు. అనంతరం మృత్యుంజయ మూలమంత్రహోమం నిర్వహించారు. ఆలయ చుర్మన్ యేల్చూరి బాలకొండలరావు, విశ్వనాథుని మణికంఠ సత్యనారాయణ, మంచికంటి సుబ్బారావు, గోష్ట రామారావు, దరిశి సత్యనారాయణ, మస్తాన్‌రావు, శేగు క్రిష్ణయ్య, భక్తులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు


స్వీట్లు పంచుకుంటున్న ఏపీపీటీడీ ఉద్యోగులు

కనిగిరి రూరల్: ఏపీపీటీడీ(ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్) ఎన్‌ఎంయుఏ ఉద్యోగులు బుధవారం సంబరాలు చేశారు. ప్రభుత్వం జీవో నెం.96ను విడుదల చేయడంతో స్థానిక ప్రజా రవాణ సంస్థ(ఆర్టీసీ డిపోలో) ఉద్యోగులు, కార్మికులంతా సంతోషం వ్యక్తం చేశారు. ఏపీపీటీడీ ఉద్యోగుల సమస్యల పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాము ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయుఏ జోనల్ నాయకులు ఎస్‌కే నజీర్, జె.మాల్యాద్రి, డిపో సెక్రటరీ జి.ఎర్రయ్య, ప్రెసిడెంట్ వి.మనోహర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కే సమీర్, గ్యారేజ్ సెక్రటరీ ఎస్‌కే మస్తాన్ వలి, డిపో ట్రెజరర్ పి. వెంకటేశ్వర్లు, డిపో నాయకులు ఎస్‌కే మొహిద్దిన్, సీహెచ్ రాధ, పి.రేణుక తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

కనిగిరి రూరల్: పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా బుధవారం పట్టణంలోని 9వ వార్డులో చైర్మన్ గఫార్ పర్యటించారు. కొలిమి వీధిలోని ప్రజలు పైప్ లైన్ తుప్పు పట్టి దెబ్బతిన్నాయని, నీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీంతో స్పందించిన చైర్మన్ గఫార్ తక్షణం వాటర్ పైప్ లైన్ మార్పుకు అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, కౌన్సిలర్ చోప్పరపు తిరుపతయ్య, గృహసారధి నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు. 9వ వార్డులోని మొబైల్ రేషన్ పంపిణీ విధానాన్ని చైర్మన్ బుధవారం తనిఖీ చేశారు. రేషన్ పంపిణీలో నిబంధనల ప్రకారం పాటించాలని, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులను అందజేయాలని ఎండీయూ ఆపరేటర్లను ఆదేశాలిచ్చారు. ఏఈ కోటేశ్వరరావు, కౌన్సిలర్ తిరుపతయ్య, నాగూర్‌బీ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

టంగుటూరు: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని ఆ శాఖ ఈఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు. టంగుటూరులో 31 బృందాలతో బుధవారం తనిఖీలు నిర్వహించారు. అడిషనల్ లోడ్ వినియోగించడంతోపాటు మాల్ ప్రాక్టీస్ చేస్తున్న 171 సర్వీసులకు రూ.5,45,000 జరిమానా విధించారు. ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. వర్షా కాలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈ తోట శ్రీనివాస్, డీఈ వినయ్‌కుమార్, ఏఈ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: రెవిన్యూ అధికారులు ప్రజా సమస్యలపై తక్షణం స్పందించి, జవాబుదారీతనంగా పనిచేయాలని ఎమ్మెల్యే, ఎన్జీ రంగా వర్శిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆర్డీఓ, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు, ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై తహసీల్దార్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. అర్జీదారుని వినతిలో వాస్తవికతను పరిశీలించి, తగు నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలన్నారు. కావాలని సమస్యలపై కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. పామూరు మండల రెవెన్యూ కార్యాలయ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. రైతులకు, అర్జీదారులకు అధికారులు జవాబుదారీతనంగా పనిచేయాలని ఆదేశించారు. చిన్న చిన్న పనులు కూడా చేయటం లేదని అనేక మంది రైతులు తన వద్ద వాపోయారన్నారు. డివిజన్ పరిధిలోని తహసీల్దార్, రెవిన్యూ అధికారుల పనితీరుపై ఆర్డీఓ ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. పామూరు తహసీల్దార్‌పై తనకు రైతులు, ప్రజలు అనేక ఫిర్యాదు చేస్తున్నారన్నారు. ఎవరైనా అర్జీలు ఇస్తే వారు పోయిన తర్వాత చింపివేయడం, సమస్యపై సలహాలు ఇచ్చిన కింది స్థాయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం, అర్జీదారులు అసలు కార్యాలయానికే రాకూడదనే తీరులో వ్యవహరిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. బీఎల్వోలు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. బీఎల్వోలు అన్ని పార్టీల బీఎల్ఏలను సమన్వయంగా చేసుకుని నిష్పాక్షపాతంగా, పార్టీలకతీతంగా అభ్యంతరం లేని 6,7,8 ఫారాలను పరిశీలించాలన్నారు. పార్టీలకతీతంగా ఓటర్ల జాబితా ప్రక్షాళన జరగాలన్నారు. సీఎస్‌పురం ఓటర్ల జాబితా ప్రక్షాళన సక్రమంగా జరగడం లేదన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినా వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హుసేన్ రెడ్డి, పార్టీ పట్టణ రంగనాయకుల రెడ్డి, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, బాలకృష్ణ, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, దాసరి మురళీ, పెన్నా ఏడుకొండలు, కనిగిరి, పామూరు, హెచ్ ఎం పాడు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


నాగులవరంలో స్కూల్‌గేమ్స్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసులు, ఎంఈఓలు


పీసీపల్లిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ, ఎంపీడీఓ

సీఎస్‌పురం (పామూరు): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సి.నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం మండల స్థాయి ఆటలపోటీలు స్కూల్‌గేమ్స్ చైర్మన్, హెచ్‌ఎం మందాకుమారి, కో ఆర్డినేటర్ షేక్.నాయబ్‌రసూల్ అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. బడ్జెట్‌లో 10 శాతానికి పైగా నిధులు విద్యారంగానికే కేటాయించారన్నారు. మండలంలో నాడు–నేడు కింద రెండు విడతల్లో 50 పైగా స్కూళ్లను రూ.12.50 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మండలానికి పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. విద్యార్థులు అండర్ 14, అండర్ 17 విభాగంలో ఖోఖో, కబడ్డి, వాలీబాల్‌తో పాటు ఇతర క్రీడలు పోటాపోటీగా ఆడి సత్తా చాటారు. కార్యక్రమంలో సర్పంచ్ ముప్పాళ్ల వసంతకుమార్, మోరం మొరార్జి, నారాయణస్వామిదేవస్థాన వైస్ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, పీఎంసీ చైర్మన్ కుర్రా వెంకట నారాయణ, అస్తి వీరాంజనేయులు, కిరణ్, హెచ్‌ఎంలు ఖాదరున్నీసా, నాగేశ్వరరావ, రమణయ్య, తిరుపతయ్య, వెంకట్రావు, బుర్రారు రమణయ్య, పులి చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీపల్లి: క్రీడలు మానసిక స్థైర్యాన్ని పెంపొదిస్తాయని ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న పోటీలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. అండర్ 17– కబడ్డీలో పెదయిర్లపాడు జట్టు విన్నర్‌గా పీసీపల్లి జట్టు రన్నర్‌గా, అండర్ 17– ఖోఖోలో విన్నర్స్ పెదయిర్లపాడు, రన్నర్‌గా పీసీపల్లి, అండర్–14లో కబడ్డీలో విన్నర్‌గా పెదయిర్లపాడు, రన్నర్‌గా మురుగమ్మి జట్లు నిలిచాయి. పోటీలు గురువారం అథ్లెటిక్స్‌తో ముగుస్తాయని కోఆర్డినేటర్ ప్రసాద్ తెలిపారు. ఎంఈఓ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వెలిగండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు స్థానిక జెడ్పీహై స్కూల్‌లో బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓలు దాసు ప్రసాద్, దేవిరెడ్డి రామిరెడ్డి పోటీలను ప్రారంభించారు. బడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, త్రోబాల్, బాల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం బి.రాఘవచారి, పీడీ వి.రామారావు, పీఎంసీ చైర్మెన్ ఆకుల రవికుమార్, ఉపాధ్యాయులు సుమన్, బి రామకృష్ణ, జానకి కళ్యాణి, జోత్స్నాదేవి, అప్పారావు, వెంకటేష్, పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు

కొండపి(సింగరాయకొండ): క్రీడలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎంఈఓ–2 పి.రామారావు పేర్కొన్నారు. కొండపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో రోజు బుధవారం స్కూల్ గేమ్స్ అండర్–14, 17 మండల స్థాయి ఎంపిక పోటీలకు ఎంఈఓ–2 ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంఈఓ–2 మాట్లాడుతూ.. ఈ పోటీల్లో 6 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 4 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సుమారు 200 మంది పాల్గొన్నారన్నారు. వాలీబాల్, కబడ్డీ, టెన్నికాయిట్, ఖోఖో, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రసాదరావు, పీఈటీలు ఎ.రవికిరణ్‌కుమార్, ఎస్.చంద్రశేఖర్, కె.ప్రభాకరరావు, సుల్తాన్‌బాషా పాల్గొన్నారు.


వెలిగండ్లలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ దేవిరెడ్డి రామిరెడ్డి


సింగరాయకొండలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పెన్షన్ కానుక పేదలకు వరం


అనంతవరలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శివరామరాజు


పామూరులో పెన్షన్ అందజేస్తున్న నేతలు


గుంటుపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నేతలు

సీఎస్‌పురం (పామూరు): వైఎస్సార్ పెన్షన్ కానుక పేదలకు వరం లాంటిదని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, ఎంపీడీఓ రామచంద్రరావు అన్నారు. మండలంలో నూతనంగా మంజూరైన ఎస్సాఆర్ పెన్సన్ కానుక నగదును స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, కొండ్రాజుపల్లెలో జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు పంపిణీ చేశారు. ఈందసర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ, కులం, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను పేదలకు అందిస్తూ పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. వైఎస్సాఆర్‌సీపీ అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, పులి రామిరెడ్డి, బత్తుల దేవరాజు, సచివాలయాల మండల అధ్యక్షుగడు బైరెడ్డి తిరుపతిరెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, రాగసాని పుల్లయ్య, దుగ్గిరెడ్డి రాము, బొర్రాజు రమణయ్య పలువురు పాల్గొన్నారు.

పామూరు: స్థానిక సచివాయంలో సర్పంచ్ అల్లూరి రాగమ్మ అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, కోఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్, సర్పంచ్ సిద్ధమూర్తి లక్ష్మీనారాయణ రెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, బీసీసెల్ నాయకులు చల్లా సుబ్బారావు, ఓగూరి ఏడుకొండలు, ఎస్.నాయబ్‌రసూల్, గోవిందయ్య, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలానికి నూతనంగా 118 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ కె.లలిత తెలిపారు. హనుమంతాపురం సచివాలయ పరిధిలో మంజూరైన 27 మందికి సర్పంచ్, కార్యదర్శులు పింఛన్లు అందజేశారు. మండల సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి రమణయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీసీపల్లి: మండలానికి నూతనంగా 164 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గుంటపల్లిలో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఎంపీపీ అత్యాల జపన్య, కొండారెడ్డి, ఓకేరెడ్డి తదితరులు ఉన్నారు.

కనిగిరి రూరల్: వైఎస్సార్ పెన్షన్ పేదలకు వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక కొత్తగా రెండో విడత మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు. కమిషనర్ డీవీఎస్ నారాయణ రావు, కౌన్సిలర్ శ్రీరాం సతీష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ నూతన పింఛన్లు

టంగుటూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు అందిస్తోందని సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు పేర్కొన్నారు. మండలంలోని అనంతవరం సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, ఎంపీటీసీ కసుకుర్తి కోటేశ్వరరావు, ఉప్పలపాటి సుబ్బరాజు, శారీమందిర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టీటీడీ అధికారులు


ఎమ్మెల్యే బుర్రాకు పత్రాన్ని అందచేస్తున్న టీటీడీ అధికారులు

కనిగిరి రూరల్: కనిగిరిలో టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈమేరకు తిరుమల తిరుపతి దేవస్థానం టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారులు బుధవారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను స్థానిక వైఎస్సార్ భవనలో కలిశారు. 2021లో అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కనిగిరికి టీటీడీ కళ్యాణమండపం మంజూరు చేసినట్లు చెప్పారు. రూ.2 కోట్లతో టీటీడీ కళ్యాణ మండపం మంజూరైన నేపథ్యంలో స్థల పరిశీలన చేస్తున్నారు. భూ కేటాయింపు, అనుమతులు తదితర పత్రాలను మున్సిపల్, రెవెన్యూ, ఇతర శాఖల నుంచి ఇప్పించాలని ఎమ్మెల్యే బుర్రాకు అధికారులు విన్నవించారు. టీటీడీ ఏఈఓ శివాజీ, ఏఓ సుధీర్, ఇంజనీర్ అధికారులు, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వాసవీ సత్రసముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురవయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే బుర్రా


గురవయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కనిగిరి రూరల్: ఇటీవల ఒంగోలు ఆస్పత్రిలో చేతికి ఆపరేషన్ చేయించుకుని ఇంటికొచ్చిన పార్టీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు కంటు గురవయ్యను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్.. కంటు గురవయ్య ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్ రంగనాయకుల రెడ్డి, కౌన్సిలర్లు పసుపులేటి అరుణోదర్, వేల్పుల వెంకటేశ్వర్లు, శ్రీరాం సతీష్, రామనబోయిన శ్రీనివాసులు, దాసరి మురళీ, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీనివాసులు, తొగురు పిచ్చయ్య పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరి


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సైదాబీ

జరుగుమల్లి: పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ సైదాబీ పేర్కొన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా జరుగుమల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై బుధవారం అవగాహన కల్పించారు. అలాగే కామేపల్లి సెక్టార్ పరిధిలోని చతుకుపాడులో అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ విజయరూత్ సూచనలు, సలహాలు ఇచ్చారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తయారు చేసుకోవడం గురించి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన ఆలయ భూముల కౌలు వేలం

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీలోని కోదండరామస్వామి దేవస్థానానికి చెందిన భూముల కౌలు వేలం బుధవారం నిలిచిపోయింది. దేవదాయశాఖ అధికారుల నిర్వాకం వల్లే కౌలు వేలం నిలిచిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కోదండ రామస్వామి ఆలయానికి ఊళ్లపాలెంతోపాటు ఇతర గ్రామాల్లో సుమారు 40 ఎకరాల భూములు ఉన్నాయి. అయితే 13.13 ఎకరాలకు మాత్రమే బుధవారం కౌలు వేలం నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని గ్రామస్తులు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుకు తెలియజేయడంతో దేవదాయ శాఖ అధికారులకు ఫోన్ చేసి మొత్తం భూములకు వేలం నిర్వహించాలని స్పష్టం చేశారు. లేదంటే వేలం తాత్కాలికంగా నిలిపేయాలని సూచించారు. ఈ పరిణామంతో దేవదాయ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ గ్రామానికి రాకుండా ముఖం చాటేశారు.

కరపత్రిక ఎలా వచ్చింది?

ఆలయానికి చెందిన 13.13 ఎకరాలకు మాత్రమే కౌలు వేలం నిర్వహిస్తున్నట్లుగా ముద్రించిన ఓ కరపత్రిక వారం రోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. దీంతో అవాక్కయిన గ్రామస్తులు.. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను ప్రశ్నించగా ఆ కరపత్రిక ఎలా వచ్చిందో తమకు తెలియదని చెప్పారు. సరిగ్గా వారం తర్వాత కరపత్రికలో ముద్రించిన విధంగానే 13.13 ఎకరాల భూములకే కౌలు వేలం నిర్వహించేందుక అధికారులు సిద్ధం కావడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మద్దతుదారుడైన ఆలయ మాజీ చైర్మన్ అచ్చికాల వెంకట సుబ్బయ్యనాయుడుతో దేవదాయ శాఖ అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

● పశువైద్యాధికారిణి శ్రావణి


మాట్లాడుతున్న పశువైద్యాధికారి శ్రావణి

మర్రిపూడి: గ్రామాల్లో మహిళా పాడిరైతులు అమూల్ కేంద్రాలల్లో పాలు పోసి ప్రభుత్వం కల్పించే గిట్టుబాటు ధరలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పశువైద్యాధికారిణి శ్రావణి పేర్కొన్నారు. మండలంలోని ధర్మవరంలోని జగనన్న పాలవెలువ కేంద్రం వద్ద బుధవారం మేగా రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు గేదెలు, లేదా ఆవులు కొనుగోలు చేసుకునేందుకు పీడీసీసీ బ్యాంక్ రుణం మంజూరు చేస్తుందన్నారు. బ్యాంక్‌లో తీసుకున్న రుణాలు తిరిగి సక్రమంగా చెల్లించాలన్నారు. 60 శాతం సబ్సిడీపై సమీకృత దాణా, 75 శాతం సబ్సిడీపై గడ్డి జొన్న విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 40 శాతం సబ్సిడీపై చాప్‌కట్టర్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి రమణారెడ్డి, వీఓ గోపిరెడ్డి ఈశ్వరమ్మ, పీడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సూర్యనారాయణ, ఏహెచ్‌ఎం జాషువా తదితరులు ఉన్నారు.

రైతులకు కిచెన్ గార్డెన్ కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

కొండపి(సింగరాయకొండ): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహార ఉత్పత్తులు తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారి వై.రంజిత్‌కుమార్ తెలిపారు. కొండపి మండలంలోని అనకర్లపూడి గ్రామంలోని ఆర్బీకే వద్ద బుధవారం ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువైన కిచెన్ గార్డెన్ కిట్లు పంపిణీ చేశారు. రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి రైతు తమ ఇంటి పరిసరాల్లోని ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్ పెంచాలని సూచించారు. ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేశామన్నారు. డ్రమ్ములు, బుట్టలు త్వరలో అందజేస్తామన్నారు. ఎంపీటీసీ వేముల వెంకటప్రసాద్, వీఏఏ భరత్, ఎఫ్ఎస్ తిరుమలరావు, సుజాత, రైతులు పాల్గొన్నారు.

అజోస్పైరిల్లంపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ డైరెక్టర్

జరుగుమల్లి: మండలంలోని పైడిపాడులో వరి మాగాణిలో అపోస్పైరిల్లం జీవన ఎరువు వినియోగించడంపై జిల్లా వనరుల కేంద్రం, ఒంగోలు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి నాట్లు వేసిన వారం రోజుల తర్వాత ఒక ఎకరానికి 500 మి.లీ ఫాస్పరస్ సాల్యుబుల్ బ్యాక్టీరియా, 500 మి.లీ అజోస్పైరిల్లంను 200 కిలోల పశువుల ఎరువుతో కలిపి వేయాలని సూచించారు. పైడిపాడులో ఎంపిక చేసిన 10 మంది రైతులకు జీవన ఎరువులను పంపిణీ చేశారు. వ్యవసాయాధికారులు డి.యుగంధర్‌రెడ్డి, శైలజ, శేషమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు నవ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని మూలగుంటపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 14వ తేదీ గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 17 విభాగాల్లో మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల పీడీ జంషీర్ తెలిపారు. అథ్లెటిక్స్, షటిల్ బాడ్మింటన్, యోగా, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

జల్‌జీవన్ పైపులైన్‌కు శంకుస్థాపన

సింగరాయకొండ: మండలంలోని పాకల పంచాయతీ పోతయ్యగారి పట్టపుపాలెం, శాంతినగర్‌లో జల్‌జీవన్ పథకం కింద రూ.25.70 లక్షల అంచనా వ్యయంతో సుమారు 3.50 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ కార్యదర్శి షేక్ సుభానీ మాట్లాడుతూ.. పోతయ్యగారిపట్టపుపాలెం, శాంతినగర్ మత్స్యకార పాలేల్లో నీటి ఎద్దడి సమస్య త్వరలోనే తీరుతుందని చెప్పారు. సర్పంచ్ ఎస్.చంద్రశేఖర్, వాయిల తాతయ్య, వాయిల పున్నయ్య, ప్రళయకావేరి రోశయ్య, కె.కృష్ణారెడ్డి, చిట్టిబాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి విద్యుత్ ఉద్యోగికి గాయాలు

కనిగిరి రూరల్: విద్యుత్ షాక్ తగిలి బొమ్మిరెడ్డి సచివాలయంలో పనిచేసే విద్యుత్ ఉద్యోగి (ఎనర్జీ అసిస్టెంట్) కే శ్రావణ్ కుమార్ తీవ్రగాయాలైన సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెలితే విద్యుత్ శ్రావణ్ కుమార్ తాళ్లూరు సబ్‌స్టేషన్ లో ఎల్‌సీ తీసుకుని బొమ్మిరెడ్డిపల్లిలో విద్యుత్ పోల్ ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. దాన్ని గమనించకుండా తాళ్లూరు సబ్ స్టేషన్ పరిధిలో పనిచేసే మరో విద్యుత్ ఉద్యోగి సప్‌లై ఆన్ చేశాడు. దీంతో శ్రావణ్‌కుమార్ షాక్ గురై పోల్ పై నుంచి కింద పడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా కాలి గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు.